


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 10 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 08


## పారదర్శకంగా
# లెక్కింపు ప్రక్రియ

### నిష్పక్షపాతంగా ఎన్నికలు చేపట్టాలి
### కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఫిబ్రవరి 13వ తేదీన నిర్వహించబోయే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ, నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 11 వ తేదీన మహబూబ్ నగర్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలలో ఎన్నికల ఓటింగ్ పూర్తయిన అనంతరం, ఫిబ్రవరి 13 వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత ..మిగతా 2లో



## ఉత్తమ ప్రతిభతో
# ఉజ్వల భవిష్యత్తు

### క్రీడలతో మానసిక ఉల్లాసం
### క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి
### వాలీబాల్ ఆడి సీఎం క్రీడలకు శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, అక్షిత బ్యూరో :** క్రీడల్లో గెలుపోటములు సహజం, క్రీడాకారులందరూ మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే క్రీడల్లో రాణించగలుగుతాని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ క్రీడా జెండాను ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడలకు శ్రీకారం చుట్టారు. స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడటం ద్వారా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. కలెక్టర్ ఆటలో పాల్గొనడాన్ని చూసి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో క్రీడల్లో ..మిగతా 2లో



## కల్తీ ఆహారంపై
# ఉక్కుపాదం

### ఆహార భద్రత తనిఖీలు పెంచాలి
### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాలను కఠినంగా అమలు చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం అందేలా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ మరియు తయారీ కేంద్రాలు తప్పనిసరిగా ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలని స్పష్టం ..మిగతా 2లో

## స్వచ్ఛందంగా ఓటు హక్కును
# వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పెంపొందించుటకు ..మిగతా 2లో





# పటిష్ట భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ

### విధుల్లో అలసత్వం వద్దు
### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ..మిగతా 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
మంగళవారం |10| ఫిబ్రవరి | 2026

## కల్తీ ఆహారంపై ఉక్కుపాదం



**మొదటి పేజీ తరువాయి...**

చేశారు.ప్రమాణాలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆహార వ్యాపారులకు అవసరమైన లైసెన్సులు ఉండాలని, వారికి శిక్షణ ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఫుడ్ పాయిజన్ కేసులపై నెలవారీ సమీక్ష చేసి, కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వైద్య శాఖకు సూచించారు. మొదటి దశలో అంగన్వాడీలు, పాఠశాలలు, ప్రభుత్వ ప్రైవేట్ వసతి గృహాల్లో నాణ్యత తనిఖీలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎలాంటి ఉపశమనం ఉండదని స్పష్టం చేశారు.రాబోయే శ్రీరామనవమి పండుగను దృష్టిలో ఉంచుకొని స్టాల్స్, హోటళ్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో సరఫరా అయ్యే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.

## స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి




**మొదటి పేజీ తరువాయి...**

ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని తెలిపారు. ఓటరుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ఏ ఎన్నికలు వచ్చిన సంబంధిత ఓటర్లు అందరూ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్ఫూర్తిని చాటారని వివరించారు. ఇదే విధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా ఓటు హక్కుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బ్యాంకింగ్ కేవైసీని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఉండాలని తెలిపారు. కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు పెద్ద ఎత్తున కేవైసీ ప్రక్రియ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లెక్కింపు ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**

కీలక దశ అని, అందుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, ఓట్ల లెక్కింపు విధానాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ల తో పాటు, రిటర్నింగ్ అధికారుల పాత్ర కూడా అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు . నామినేషన్ దశ నుంచి ఫలితాల ప్రకటన వరకు మొత్తం ఎన్నికల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపును సజావుగా, న్యాయంగా, విశ్వసనీయంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ సిబ్బందికి సరైన మార్గదర్శకం చేయాలని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా అత్యంత జాగ్రత్తతో ఎన్నికల విధివిధానాలను పాటిస్తూ, పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. ఒక వేళ రీకౌంటింగ్‌కు సంబంధించి ఏవైనా అభ్యర్థనలు వస్తే వాటిని రాతపూర్వకంగా స్వీకరించాలని తెలిపారు. రీకౌంటింగ్‌ను ఆమోదించాలా, తిరస్కరించాలా అనే తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారి విచక్షణ ఆధారంగా నిర్ణయం




తీసుకోవాలని స్పష్టం చేశారు.లెక్కింపు కేంద్రాలలో రిటర్నింగ్ అధికారికి తప్ప ఇతరులకు మొబైల్ ఫోన్లు అనుమతించరాదని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, శిస్పక్షపాతంగా చేస్తున్న విధాన్ని వారికి చూపించాలని అన్నారు. ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తవగానే కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపు అనంతరం అభ్యర్థుల ఎన్నికల ఫలితాలను, జిల్లా ఎన్నికల అధికారుల అనుమతితోనే ప్రకటించాలని సూచించారు. ఒక వేళ పోటీలో ఉన్న అభ్యర్థులకు సమాన ఓట్లు వస్తే వారికి డ్రా ద్వారా ఫలితాలను నిర్ణయించాలని సూచించారు. ఈ సందర్భంగా సాధారణ

ఎన్నిక పరిశీలకురాలు కాత్యాయని దేవి మాట్లాడుతూ, ఒక వేళ రికౌంటింగ్ సంబంధించిన విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళిలో సూచించిన మార్గదర్శకాలను పాటించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఎటువంటి లోటుపాట్లకు తావు ఇవ్వకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అంతకు ముందు, మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ సూపర్వైజర్లకు, కౌంటింగ్ అసిస్టెంట్లకు, వారి విధులు, బాధ్యతలపై వివరంగా అవగాహన కల్పించారు. లెక్కింపు సమయంలో చేయవలసిన పనులను మాక్ శిక్షణ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి చూపించారు. లెక్కింపు సమయంలో మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలని, అనంతరం బ్యాలెట్ బాక్సులలోని ఓట్లను లెక్కించాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పి ఓ డైరీ, పేపర్ సీల్ అకౌంట్, విసిట్ షీట్ ను ఓట్ల లెక్కింపు సమయంలో తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్.డి.ఓ నవీన్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, ఇంచార్జి జిల్లా పంచాయతీ అధికారి వెంకట్ రెడ్డి, డి ఇ ఓ ప్రవీణ్ కుమార్, సి యం ఓ సుధాకర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్, శ్రీకాంత్, నాగరాజ్, రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభతో ఉజ్వల భవిష్యత్తు

**మొదటి పేజీ తరువాయి...**

మంచి ప్రతిభను ప్రదర్శించి, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభతో రాణించి నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, ప్రతి క్రీడాకారుడు అంకితభావంతో కృషి చేసి రాష్ట్ర స్థాయి సీఎం కప్ నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకుని పోటీల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా ప్రావీణ్యం సాధించాలని సూచించారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక బలాన్ని, క్రమశిక్షణను అలవాటు చేస్తాయని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతూ జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం కప్‌లో భాగంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పోటీలను ఘనంగా నిర్వహించామని, ఆ దశల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఇప్పుడు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. తదుపరి దశలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.అనంతరం నాగర్‌కర్నూల్, అచ్చంపేట జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలను జిల్లా కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. అనంతరం వాలీబాల్ పోటీలను కూడా ప్రారంభించి, వాలీబాల్ క్రీడాకారులతో కలిసి జిల్లా



కలెక్టర్ స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడారు.ఈ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ,

ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సామ రమేష్, సుభాషిని, నరేందర్, నిరంజన్ యాదవ్, వెంకటయ్య జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ట భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బందికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి నీడ, కుర్చీలు, త్రాగునీరు, భోజన వసతి కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాలులో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించే సిబ్బంది ప్రశాంతంగా తమ ఓటును వినియోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, తహసిల్దార్ రియాజ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి..

### ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలి...

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** జిల్లాలో ఈ నెల 11న జరుగు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతి మున్సిపాలిటీ కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని విసి హాల్ నందు జిల్లా ఎస్పీ,ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వెబ్ ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫిరెన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సంబంధించి ప్రతి మున్సిపల్ కేంద్రంలో జోనల్ ఆఫీసర్,ఆర్వోల వారిగా డిఆర్సి కేంద్రాలు ఏర్పాటు చేయాలని,ఇట్టి కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు మంచినీటి సౌకర్యం,భోజన ఏర్పాట్లు చేయాలని అలాగే పోలింగ్ రోజు కూడ సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్స్ లు,బ్యాలెట్ పేపర్,సిబ్బంది పోలింగ్ కేంద్రానికి ఎస్కార్ట్ వాహనంతో మాత్రమే వెళ్లాలని,ఎఫ్ఎస్టి,ఎస్ఎస్టి టీం సభ్యులు చురుకుగా ఉండి డబ్బు, మద్యం పంపిణీ జరిగితే చర్యలు తీసుకోవాలని,9న సాయంత్రం 5 గంటల నుండి ప్రచారం బంద్ చేయాలని అలాగే మున్సిపల్ ఏరియాలో సాయంత్రం 5 గంటల నుండి 11 తారీకు పోలింగ్ ముగిసే వరకు మద్యం షాపులు బంద్ చేయించాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను డి జిటి వాహనంలో ముందు,వెనుక ఎస్కార్ట్ వాహనాలతో మాత్రమే స్ట్రాంగ్ రూములకు తరలించాలని,మిగిలిన బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా కవర్ లో పెట్టి సీల్ వేయాలని,పోస్టల్ బ్యాలెట్ పేపర్లను వార్డుల వారిగా విభజించి కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలని జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు,ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పని చేయాలని,నిబంధనలు అతిక్రమించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం చర్యలు తీసుకొబడతాయి కావున ఎన్నికల సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను దిగ్విజయంగా, విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు,డిప్యూటీ సీఈవో శిరీష,డిపిఓ నారాయణరెడ్డి,ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి,బీసీ సంక్షేమ అధికారి నరసింహ,సి సెక్షన్ సూపర్డెంట్ సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



**రెండు రోజులు సెలవు దినం...**

సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వినియోగించుకుంటున్న అన్ని విద్యాసంస్థలు,ప్రభుత్వ భవనాలు,ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ పోలింగ్ ముందు రోజైన ఫిబ్రవరి 10,పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11న సూర్యాపేట మున్సిపాలిటీతో పాటు తిరుమలగిరి,కోదాడ హుజూర్ నగర్,నేరేడుచర్ల మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ మున్సిపాలిటీలలో పోలింగ్ నిర్వహణకై వినియోగించుకుంటున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు,విద్యా సంస్థలకు,ఇతర భవనాలకు పోలింగ్ ముందు రోజు,పోలింగ్ రోజున రెండు రోజులు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అలాగే మున్సిపల్ ఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పబ్లిక్,ప్రైవేట్ అండర్ టేకింగ్స్, ఫర్మ్ లలో పని చేసే ఉద్యోగులు వారి ఓటు హక్కును వినియోగించు కునేందుకు గాను నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ చట్టం - 1881 కింద చెల్లింపుతో కూడిన సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందువల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న సూర్యాపేట మున్సిపాలిటీ,ఇతర 4 మున్సిపాలిటీల పరిధిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు,స్థానిక సంస్థల ఉద్యోగులు,ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే ఉద్యోగులు,పబ్లిక్ ప్రైవేట్ అండర్ టేకింగ్,ఫర్మ్ లలో పనిచేసే ఉద్యోగులు మున్సిపల్ ఎన్నికలలో ఓటు వేసి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

## 32వ వార్డు అభ్యర్థి పాశం శ్రీనివాస్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

### కాంగ్రెస్ తోనే పట్టణ ప్రగతి

### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి



**కోదాడ అక్షిత ప్రతినిధి:** 23 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాశం శ్రీనివాస్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక శాసన సభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డి వార్డు ప్రజలను కోరారు సోమవారం వార్డులో నిర్వహిస్తున్న ప్రచారంలో పాల్గొని మాట్లాడారు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో హ్యాపీగా ఉన్నారని కాంగ్రెస్ పాలననే కోరుకుంటున్నారని అని అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతలపాటి శ్రీనివాస్, భాష బోయిన భాస్కర్ కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ సీనియర్ న్యాయవాది గాలి శ్రీనివాస్ నాయుడు, గుండెల సూర్యనారాయణ యాదవ్, తెప్పని శ్రీనివాస్ ,గుండె పొంగు రమేష్ ,నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## వాహనాలను తీసుకెళ్ళండి

### వరంగల్ సిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ భీమారం, సి.ఆర్ పి. ఎఫ్ కేంద్రంలో భద్రపర్చారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపారనీ. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహ నాలను తిరిగి అంద జేయనున్నారు. మరింత సమాచారం కోసం సిసి ఆర్ బి ఏసీపీ డేవిడ్ రాజ్ సంప్రదించండి లేదా యం. టి. ఓ రిజర్వ్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ ,8712685158, సిసి ఆర్.బి ఇన్స్ స్పెక్టర్ మల్లయ్య 8008389789 నంబర్లను సంప్రదించాలని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే పట్టణ ప్రగతి

### రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఘనవిజయం

### డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత





**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** గత రెండు సంలుగా రోజుకు 18 గంటలు కష్టపడుతూ తెలంగాణ అభివృద్ధి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి తిరుగులేదు. అభివృద్ధి సంక్షేమం వారి నాయకత్వంలో ముందుకు సాగుతుంది. అప్పులు పాలైన తెలంగాణ రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలో 70 శాతం పైగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. నల్గొండ జిల్లాలో జరుగుతున్న నల్గొండ కార్పొరేషన్ లోన్ సహా ఆరు మున్సిపాలిటీలను కైవనం చేసుకుంటాం. బిఆర్ఎస్ బిజెపికి ఓటు వేస్తే దండగ సంక్షేమ పథకాలు ఆగిపోతాయి. గత రెండు సంవత్సరాలుగా 19 వేల కోట్లు నిధులను పట్టణాలకు ఖర్చు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే. సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, కొత్త సిసి రోడ్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 ఉచిత యూనిట్ల కరెంటు 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ చీరలు ప్రజాపాలనలో అందిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం. బిఆర్ఎస్ బిజెపిలు అక్రమ సంబంధాలతో గెలవాలని చూస్తున్నారు. దయచేసి వారికి ఓటు వేస్తే మురికి కాల్వలో వేసినట్లే. జిల్లాలో బిఆర్ఎస్ బిజెపికి అభ్యర్థులు కరువు అయ్యారు. 2029 సంవత్సరాలో తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రానున్నది. ముఖ్యమంత్రిగా రెండవ సారి రేవంత్ రెడ్డి అవుతారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జలపెల్లి పరమేష్, ఎండి ముంతాజ్ అలీ, భవ్యతేజ్ రెడ్డి, గౌతమ్, రవీందర్ రెడ్డి, పగిళ్ల రాజు, శరత్, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఫిబ్రవరి 11న పబ్లిక్ హాలిడే..

**ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు,**

**ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**




నాగర్ కర్నూల్ అక్షిత బ్యూరో: రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు ? 2026 సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11 (బుధవారం) నాడు పబ్లిక్ హాలిడే ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 11న ఎన్నికలు జరగనున్న నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ?ప్రైవేట కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

అదేవిధంగా, సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పోలింగ్ నిర్వహణకు వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థలకు ఫిబ్రవరి 10 (మంగళవారం) నాడు సెలవు ప్రకటించగా, ఓట్ల లెక్కింపుకు వినియోగించే విద్యా సంస్థలకు ఫిబ్రవరి 12 (గురువారం) మరియు 13 (శుక్రవారం) లోకల్ హాలిడే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బాదావత్ సంతోష్ కోరారు.

## పెన్షనర్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**పిఆర్పిఏ రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి మధు**



ఖమ్మం/అక్షిత బ్యూరో : పిఆర్పిఏ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా పిఆర్టియు సంఘ కార్యాలయంలో పిఆర్పి ఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీనియర్ కార్యకర్త సాదు లక్ష్మణరావు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించడమైనది.

జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో మోత్కూరు మధు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్స్ కు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేసి వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఆర్టియు సంఘ వ్యవస్థాపకులు కీర్తిశేషులు సామినేని హిమవంతరావు కుమారుడు సామినేని రమేష్ దంపతులను ఘనంగా సత్కరించ నైనది.పిఆర్పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికీ జిపిఎఫ్ జిఐఎస్ సరెండర్ లీవ్ ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని పిఆర్పి ను వెంటనే ప్రకటించాలని బకాయిలో ఉన్న డిఏ లను విడుదల చేసి, హెల్త్ కార్డ్స్ ని అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ పి ఏ జిల్లా కన్వీనర్ వైవి పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు కందుల వెంకట నరసయ్య చిత్తలూరి ప్రసాద్ గుడిపూడి శ్రీనివాస్ లింగం సతీష్ వినోద్ పి కొండలరావు కొత్త శ్రీనివాసరావు ఎం సీతారామయ్య జగన్మోహన్రావు మోహన్ దాస్ సైదయ్య జి. నారాయణ ఎస్ జగన్ మోహన్ రావు తాత రాఘవయ్య వీరభద్రరావు దామోదర్ రెడ్డి ఎం కాంతారావు నాగేశ్వరరావు మాధవరావు పెద్ద సంఖ్యలో పిఆర్పిఏ పిఆర్టియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

**ఆలేరు, యాదగిరిగుట్ట ఎన్నికల ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్**

**పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన**



యాదగిరిగుట్ట/అక్షిత న్యూస్: సోమవారం ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందర్శించారు. ఎంత మంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ వార్డుకా వార్డుల వారీగా బ్యాలెట్ పేపర్లు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ లో ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం సాయంత్రం కల్లా ముగుస్తుందని తెలిపారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్యన కౌంటింగ్ హాల్ కు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వద్దు

**ఓట్ల లెక్కింపు సిబ్బంది తమ విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




నిర్మల్, అక్షిత ప్రతినిధి: మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి సందేహాలు వచ్చినా పై అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సంబంధిత ఫారములను పకడ్బందీగా పూరించి, మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణితంలో ఆర్.సుహాసినికి పీహెచ్.డీ.



పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:గణితంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డీ)ని విజయవంతంగా పూర్తిచేసిన డాక్టర్ ఆర్. సుహాసినిని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అభినందించింది. 'నానోపార్టికల్స్ తో కూడిన సాగే షీటుపై మాగ్నెటోహైడ్రోడైనమిక్ (ఎంహెచ్ డీ) మైక్రోపోలార్ ద్రవ ప్రవాహంపై ఒక సంఖ్యా అధ్యయనం' అనే శీర్షికతో ఆమె పరిశోధన చేసినట్టు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇది న్యూటోనియన్ కాని ద్రవ గతిశాస్త్రం, వేడి, ద్రవ్యరాశి బదిలీ దృగ్విషయాల అధ్యయనానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందన్నారు.

ఈ పరిశోధన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధన పర్యవేక్షకుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస రాజు మార్గదర్శనంలో నిర్వహించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం మాగ్నెటో-మైక్రోపోలార్ నానోఫ్లూయిడ్ ప్రవాహంపై వివిధ భౌతిక పారామితుల ప్రభావాలను విశ్లేషించడానికి అధునాతన సంఖ్యా పద్ధతులను ఉపయోగించిందని,ధృవీకరించిన ఫలితాలు ఇప్పటికే అందుబాటులో ఉన్న సాహిత్యంతో దగ్గరగా ఉన్నాయన్నారు.డాక్టర్ సుహాసిని విజయవంతంగా డాక్టరేట్ డిగ్రీకి అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, ఇతర అధ్యాపకులు తదితరులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌తోనే స్థిరత్వం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** సమగ్ర అభివృద్ధితో పాటు స్థిరమైన పాలన, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఓటర్లను కోరారు. మహబూబ్‌నగర్ నగరంలోని వివిధ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మారేపల్లి సురేందర్ రెడ్డి (డివిజన్?11), షబీనా బేగం (డివిజన్?28), అయేషా సిద్దిఖి (డివిజన్?29), లక్ష్మి దేవి (డివిజన్?30), జి పద్మజ (డివిజన్ -31) లకు మద్దతుగా ఆయా డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మన



మహబూబ్‌నగర్ మట్టి బిడ్డ అని, ఆయనకు ప్రజల కష్టనష్టాలు, బాధలు, కన్నీటి గోస అన్నీ తెలుసునని అన్నారు. అందుకే గత పది సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొన్న బాధలను దూరం చేస్తూ, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ?500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే, మహబూబ్‌నగర్ యువతకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఐఐఐటీ కళాశాల, ఇంజనీరింగ్, లా కళాశాలలు వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను మహబూబ్‌నగర్‌కు తీసుకువచ్చి, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# ఆర్థిక అంశాలలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### సైబర్ మోసాల పట్ల విస్తృత ప్రచారం కల్పించాలి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఆర్థిక అంశాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన గోడ పత్రికలను అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఆన్ లైన్ లో జరుగుతున్న మోసాల గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం మనం అధికంగా ఫోన్ ద్వారా లావాదేవీలు చేస్తున్నామని సైబర్ నేరగాళ్ళు మన ఫోన్ నుంచి సమాచారం సేకరించి బ్యాంకులో ఉన్న డబ్బును దోచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

ప్రముఖ వైద్యులు వ్యాపార వేత్తలు కూడా సైబర్ మోసాలకు గురయ్యారని అన్నారు. మన ఫోన్ పాస్ వర్డ్ 6 నెలలకు ఒకసారి మారుస్తూ ఉండాలని ముఖ్యమైన ఖాతాలకు తప్పనిసరిగా 2 ఫ్యాక్టర్ అతెంటికేషన్ పెట్టాలని కెవైసి వివరాలను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఎంఎస్ లో వచ్చే ఫ్రాడ్ లింకులను మనం క్లిక్ చేయవద్దని ఫోన్ కాల్ లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి ఆధార్ బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికి ఇవ్వవద్దని అన్నారు. వాట్సాప్ ద్వారా కలెక్టర్ ఉన్నతాధికారుల పేర్ల మీద మెసెజ్ చేస్తూ డబ్బులు అడుగుతూ మోసం చేస్తున్నారని మనం ఒకరికి డబ్బులు పంపే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలని అన్నారు.ఫోన్ లో అడ్డమైన యాప్ లను డౌన్ లోడ్ చేయవద్దని యాప్ లకు అనుమతులు ఇచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మన కుటుంబానికి ఎటువంటి భీమా తీసుకోవాలి మనం పెట్టుబడులు పెట్టే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మన ఇంటిలో ఉన్న వృద్దులను కూడా సైబర్ నేరాల పట్ల జాగృతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, ఎల్డిఎం ఏ రవిప్రసాద్ టిజిబి రీజనల్ మేనేజర్ ఏ ప్రసన్న కుమార్ ఎస్బిఐ చీఫ్ మేనేజర్ శ్రీ రామ్ బరన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ కార్మికుల మెడకు ఉరితాళ్ళు

### 12న జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** కార్మికుల మెడలకు ఉరితాడులా మారిన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని ఈ నెల 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక లోకమంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోరుతూ రామన్నపేట సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేశం మాట్లాడుతూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కార్డులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేగతనంతో ఎక్కువ పని చేయించుకుని వారానికి 72 గంటల పనిని ముందుకు తీసుకొస్తూ హక్కులు అణిచివేయబడుతున్నాయాన్నారు. కార్మికులు హక్కుల పరిరక్షణ కోసం యాజమాన్యాల వేధింపులను అరికట్టడం కోసం యూనియన్ గా ఏర్పడే పరిస్థితి లేకుండా నూతన లేబర్ కోడ్స్ ఉన్నాయని. కార్మికుల హక్కుల్ని కళ రాస్తూ కార్పొరేట్లకు ఎర్రతి వాచీ పరిచే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నియంతృత్వ పోకడపై సంఘటిత అసంఘటిత కార్మికులు మిలితమై పోరాటానికి సన్నద్ధం కావాలని అన్నారు. అన్ని రంగాల కార్మికులు 12న జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షుడు జరిగిన ఈ సదస్సులో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వంగాల మారయ్య, ట్రాన్స్ పోర్ట్ యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు పల్లె సత్యం,జినుక లింగయ్య,గోగు మహేష్, చిత్ర కంటి శోభ, పుట్టల నాగరాజు,నల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ లింగాల పిఎస్ సురాపూర్ పాఠశాలలను తనిఖీ

### మండల విద్యాధికారి శ్రీ బషీర్ అహ్మద్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** సిపిఎస్ లింగాల పిఎస్ సురాపూర్ పాఠశాలలను మండల విద్యాధికారి శ్రీ బషీర్ అహ్మద్ తనిఖీ చేయడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించడం జరిగింది. ఎఫ్ ఎల్ ఎస్ బోధనపై మూడవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించడం జరిగిందిప్రతి ఒక్క ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ ప్రకారం విద్యా బోధన చేయాలని సూచించడం జరిగింది. ఎఫ్ ఆర్ ఎస్ హాజరు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్ కర్నూల్ అక్షిత బ్యూరో:** ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేందుకుగాను ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అదనపు కలెక్టర్ దేవ సహాయం లతో కలిసి కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్, మాట్లాడుతూ, ??. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్



మున్సిపాలిటీల పరిధిలోని 8 బ్యాలెట్ టేబుళ్లకు ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేందుకుగాను అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచే విధంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు)ను మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా నేరుగా ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయింపు ప్రక్రియను పూర్తిచేసినట్లు వెల్లడించారు.

ఎన్నికల విధుల్లో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వర్తించేలా అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించే దిశగా ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డీఈవో రమేష్ కుమార్ ఈడీఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## లీకేజ్ అవుతున్న పైప్లైన్ మరమ్మతులు

### గ్రామ ఉపసర్పంచ్ మార్కం వెంకటయ్య



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని దత్తారం గ్రామంలో వాటర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో అట్టి పైపులైన్ గ్రామ ఉప సర్పంచ్ మార్కం వెంకటయ్య ఆధ్వర్యంలో పైప్ లైన్ రిపేరు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి రిపేర్ పనులు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అక్బర్ బాషా ఆదేశాల అనుసారం వారి సిబ్బంది గ్రామానికి చేరుకొని బాగు చేశారు.

## ఇక ప్రచారం పరిసమాప్తం

### ఎన్నికల ప్రచారం ముగింపు

### ఎలాంటి ప్రచారం నిషేధం

### జిల్లా ఎస్పీ డి. జానకి



**మహబూబ్‌నగర్, అక్షిత న్యూస్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఎన్నికల ప్రచారం పూర్తిగా ముగుస్తుందని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం బయటి ప్రాంతాల నుండి వచ్చిన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రచార సిబ్బంది మరియు ఇతరులు అందరూ తప్పనిసరిగా సాయంత్రం 5.00 గంటల లోపు తమ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయం అనంతరం జిల్లాలో రోడ్లపై ప్రచారం చేయడం సభలు, ర్యాలీలు, నినాదాలు వాహనాల ద్వారా ప్రచారం గుంపులుగా సంచరించడం వంటి చర్యలు చేపట్టినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి మరియు సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రచారం ముగిసిన తరువాత కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రచారం కొనసాగించినట్లయితే సంబంధిత వ్యక్తులు చట్టపరమైన శిక్షలకు లోనవ్వాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు మరియు రాజకీయ పార్టీలు శాంతియుత, న్యాయసమ్మత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## భోగ్ బండారో కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల హెడ్ క్వార్టర్ లోని రైతు వేదిక ఎనకాల ఉన్న స్థలంలో లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ భోగ్ బండారో కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొర్లబోడు తండా సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్ మరియు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ కోటేష్ నాయక్ పాల్గొన్నారు.

## 12న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

### వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక సంఘాలు కృషి చేయాలి

### సిపిఐ (ఎమ్ ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల రైతు,కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెను ఆందోళనలను విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగాన్ని విచ్చిన్నం చేయడం కోసం తీవ్రమైన ప్రయత్నాలు జరుగుతుందని దాంట్లో బాగానే రైతాంగానికి నష్టం చేసే విధంగా నల్ల చట్టాలను తేవటం కోసం, విద్యుత్ సవరణ బిల్లును తేవడం కోసం మోడీ ప్రభుత్వం తీవ్రమైన కృష జరుపుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని విద్యుత్ 2025 బివిజి రామ్ జి చట్టం విత్తన సవరణ బిల్లును. ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడులు అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను వెనక తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది.

అమెరికాతో ఒప్పందం రద్దు చేయాలని దిష్టిబొమ్మ దగ్ధం భారత్ అమెరికా సామ్రాజ్యవాదంతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయటం జరిగింది. ఈ సందర్భంగా గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి యాజ మాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చింది వీటివల్ల కార్మికులు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కోల్పోతారు,విద్యుత్ సవరణ బిల్లు వల్ల సామాన్యులకు విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయని స్మార్ట్ మీటర్లు క్రాస్ సబ్సిడీ రద్దుతో రైతులను పేదలకు ఉచిత మరియు సబ్సిడీ విద్యుత్ ప్రమాదాన పడుతుందని రాష్ట్రాల హక్కులను కాల రాస్తుందని ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం విద్యుత్ ఛార్జీలు మరియు కీలక విషయాలని రాష్ట్రాల అధికారులు తగ్గించి తన పట్టును పెంచుకుంటుందని విత్తన సవరణ బిల్లు వలన విత్తనాల దారులను నియంత్రించే అధికారం ప్రైవేట్ కంపెనీలు చేతుల్లోకి వెళ్లి బహుళ జాతి కంపెనీల పట్టు పెరుగుతుందని దీనివల్ల సాగు ఖర్చు భారీగా పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఒగ్గు నాగిరెడ్డి బీరెల్లి లాజర్, ఏ.వెంకన్న ,అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సారా కిషోర్, గంట శ్రీను, నాయకులు తాటిరాజు, నెక్కొండ అలివేలు దుంపరాగవులు, అమర్లపూడి శరత్,సున్నం రాజారావు,బొజ్జ వెంకటేశ్వరరావు, ప్రకాశరావు,నెక్కొండ అలివేలు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం

### ఆర్థిక అవగాహనతో ప్రతి ఒక్కరు ఉండాలి

### ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ అక్షిత బ్యూరో:** ప్రతీఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకుని ఆర్థిక క్రమ శిక్షణ పాటించటం అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై రూపొందించిన నాలుగు రకాల అవగాహన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ?? బ్యాంకింగ్ రంగ సేవల్లో ఇటీవల కాలంలో విస్తృతమైన మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ మార్పులకు అనుగుణంగా ఖాతాదారులు నగదు రహిత లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ లావాదేవీల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులకు, ప్రజలకు ఆయా బ్యాంకర్లు తగిన అవగాహన కల్పించాలని సూచించారు.

ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా డిజిటల్ లావాదేవీల విధానాలు, సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులు, బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక మోసాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులు, సందేశాలను క్లిక్ చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు.

సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో తీసుకునే రిస్క్ ఎప్పటికీ లాభదాయకంగా ఉండదని కలెక్టర్ హెచ్చరించారు. అనవసరమైన లాభాపేక్షకు పోయి ప్రజలు మోసాలకు గురై నష్టాలు చవిచూడకూడదని సూచించారు. బ్యాంకింగ్ సేవలపై సరైన అవగాహనతో పాటు జాగ్రత్తతో కూడిన ఆలోచన విధానం ఉంటేనే ఆర్థిక భద్రత సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సురక్షిత బ్యాంకింగ్ విధానాలను అనుసరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ వివిధ బ్యాంకుల కు చెందిన మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

**దేవరకద్ర, అక్షిత న్యూస్:** మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు దేవరకద్ర మున్సిపాలిటీలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ, ఎన్నికల ప్రచారంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే, అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అధికార పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేద్దామని ఈ సందర్భంగా మున్సిపాలిటీ





ప్రజానీకానికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

దేవరకద్ర మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో దేవరకద్ర మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలలోకి వెళ్తే, ప్రతి ఒక్కరూ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల సంతోషంగా ఉన్నారని, అందుకే మరోసారి ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారన్నారు.

ప్రజలల్లో ప్రజా ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి, ఓర్వలేక బిఆర్ఎస్, బిజెపి లు చీకటి ఒప్పందం చేసుకున్నారని, రేపు జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు ఓటుతో ప్రజలే బుద్ధి చెప్తారని, మీరెన్ని కుట్రలు చేసిన ప్రజల ఆశీర్వాదంతో దేవరకద్ర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు.

ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# ఈ నెల 11న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సెలవు

### మున్సిపాలిటీ ఎన్నికలలో 100 శాతం పోలింగ్ లక్ష్యం



**యాదాద్రి భువనగిరి /అక్షిత న్యూస్:** మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుటకు గాను ఈనెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున స్థానిక సెలవు గా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్,మోత్కూర్ మున్సిపాలిటీ లలో పోలింగ్ జరిగే రోజు ఈ నెల 11వ తేదీన ప్రభుత్వ, సంస్థల ఉద్యోగులకు, సాధారణ సెలవు, ఎన్నికల ప్రాంతంలో ఉన్న షాపులు సంస్థలు ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే ప్రభుత్వ భవనాలు విద్యాసంస్థల భవనాలకు ఈనెల 10వ తేదీన (మంగళవారం) పోలింగ్ కు ముందు రోజు, 11వ తేదీన (బుధవారం) పోలింగ్ రోజు, 13వ తేదీ (శుక్రవారం ) ఓట్ల లెక్కింపు తేదీల్లో

సెలవును ప్రకటించినట్లు పేర్కొన్నారు. అందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లు తప్పకుండా తమ విలువైన ఓటును పోలింగ్ రోజున వినియెగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# నిరుపేద విద్యార్థికి చేయూత

### పుస్తకాలు, ఆర్థిక సహాయం అందజేత





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి ఆపరేషన్ అనంతరం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న గుండ్ర మోహన్ (కల్లూరు)అనే ఓ నిరుపేద విద్యార్థికి సోమవారం దాతల సహకారంతో పుస్తకాలు, ఆర్థిక సహాయం లభించింది. ఈ విద్యార్థి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతని ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు గుర్తించిన స్థానిక నవోదయ బుక్ స్టోర్ యాజమాని కొత్తూరు ప్రసాద్ డిగ్రీ స్టడీ మెటీరియల్ అందజేయగా, వైద్య ఖర్చుల నిమిత్తం విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ విద్యార్థి తల్లిదండ్రులుకూలి పని చేస్తూ జీవిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్ కు ఆపరేషన్ అనంతరం తనకు నెలకు రూ. 6000 వరకు మెడిసిన్స్ కు ఖర్చు కారణంగా ఆర్థిక ఇబ్బంది అవుతున్నట్లు తెలిపాడుతనకుదాతలుసహకరించాల్సిందిగా కోరారు.

# బూస్టర్ ఏర్పాటు త్రాగు నీటి ప్రెషర్ సమస్యకి శాశ్వతంగా పరిష్కారం..



### కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్..

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా హై ప్రెజర్ బూస్టర్ ను నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసి ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ . శేరిలింగంపల్లి డివిజన్ లోగల గోపినగర్, నెహ్రూనగర్, బాపునగర్ , పలు బస్తిలలో గత కొంత కాలంగా లోప్రెషర్ త్రాగు నీరు వస్తున్నాయని తమకు హై ప్రెషర్ త్రాగునీటి సదుపాయం కల్పించాలని బస్తీ వాసులు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ను కోరారు.

అందుకు కార్పొరేటర్ స్పందిస్తూ.. తక్షణ చర్యలు చేపట్టి బస్తివాసులకు మెరుగైన త్రాగునీటి సదుపాయం కల్పించాలనే సంకల్పంతో.. ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో చర్చించి ముఖ్యంగా గోపి నగర్ గుట్ట ప్రాంతంలో, నెహ్రూ నగర్ పరిసర బస్తీ వాసులకు హై ప్రెషర్ త్రాగునీటి సదుపాయం కొరకు 'బూస్టర్' ను అందుబాటులోకీ తీసుకువచ్చి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందులో భాగంగా ప్రధానంగా లోప్రెషర్ త్రాగు నీటి సమస్యను అదిగమించమని పేర్కొన్నారు. డివిజన్ ను ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దామని అన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తక్షణమే సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.గోపినగర్, నెహ్రూనగర్ తదితర బస్తీ వాసులు కార్పొరేటర్ హై ప్రెషర్ త్రాగునీటి కోసం ఎంతగానో కృషి చేశారని వారికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం నరేందర్, వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు యాదాగౌడ్, వార్డు మెంబర్ పర్వీన్ బేగం, గఫుర్, విష్ణువర్ధన్ రెడ్డి, కొయ్యడ లక్ష్మణ్, యాదవ్, రవి యాదవ్, రాజ్ కుమార్, నరసింహ రెడ్డి, శ్రీకాంత్, నరసింహ, మహేందర్ సింగ్, దస్తగిర్, షకీల్, సాయన్న, సత్యనారాయణ, రవి, ముంతాజ్ బేగం, రేణు, మహేష్ చారీ, సలీం, సాయి, మహేష్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం

### పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి




**నాగర్ కర్నూల్ అక్షిత బ్యూరో:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నాగర్ కర్నూల్, కల్వకుర్తి కొల్లాపూర్, పట్టణాలలో నేటి 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

## ప్రజా సంపదను దోచుకున్న జగదీశ్ రెడ్డి వేల కోట్లకి ఎదిగాడు

### బడుగు నేత దశరథ గౌడ్‌ను విమర్శించడం సరైనది కాదు

### కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం.

### తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** తెలంగాణలో రెండు సార్లు మంత్రిగా పని చేసిన జగదీశ్ రెడ్డి ప్రజా సంపదని దోచుకుతిని వేల కోట్లకు ఎదిగాడని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆరోపించారు.సోమవారం పట్టణంలోని 14 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పంతంగి దశరథ గౌడ్ తరపున ప్రచారం నిర్వహించి మాట్లాడారు.బడుగు,బలహీన వర్గాలకు చెందిన పంతంగి దశరథ గౌడ్ కాంట్రాక్టర్ల పేరుతో దోచుకు తిన్నాడని జగదీశ్ రెడ్డి విమర్శించడం సిగ్గుచేటు అన్నారు.సొంత కృషితో ఎదిగిన దశరథ గౌడ్ ను విమర్శించడం అంటే బలహీన వర్గాలను విమర్శించినట్లేనని మండి పడ్డారు.కరోనా కష్టకాలంలో కూడా దశరథ గౌడ్ ఎన్నో సేవ సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు.స్థానికేతరుడైన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఓడించి స్థానికుడైన పంతంగి దశరథ గౌడ్ గెలిపిస్తే వార్డును రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున మా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా వార్డులో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, గోదాల రంగారెడ్డి,రిటైర్డ్ టీచర్స్, కాంగ్రెస్ నాయకులు,తదితరులు ఉన్నారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ శ్రేణుల ముమ్మర ప్రచారం..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కోఆర్డినేటర్ , శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గా పోటీ చేస్తున్న పబ్బే శ్రీనివాస్ తో కలిసి గడప గడపకు ముమ్మరంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ ప్రచారంలో మియాపూర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, రవికుమార్ గౌడ్ , వారి టీమ్ సభ్యులు చురుకుగా పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన గత రెండు సంవత్సరాల అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.అనంతరం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన మహిళా ఆత్మీయ సమ్మేళనంలో పంచాయితీ రాజ్ , గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీలు , శిశు సంక్షేమ శాఖల క్యాబినెట్ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, మహిళా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళ బలపడితే కుటుంబం, కుటుంబం బలపడితే దేశం బలపడుతుందని ఆమె పేర్కొన్నారు.మహిళలు ముందుకు వస్తే సమాజం ముందుకు సాగుతుందని, మహిళల ఆశలు, అవసరాలు, హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మహిళా సాధికారతే సమాజ అభివృద్ధి అని, అదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని అన్ని 24 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో యలమంచి ఉదయ్ కిరణ్, రవికుమార్ గౌడ్‌తో పాటు రాధాకృష్ణ, వంశీ, రత్నాచారి, ప్రవీణ్, నాగ సాయి తదితరులు, అలాగే పలువురు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల్లో దళిత బహుజన సర్పంచులకు అవమానం

### మానవ హక్కుల కమిషన్‌కు పిర్యాదు చేస్తాం

### బర్రె సుదర్శన్

### జిల్లా డి వి ఎం సి సభ్యులు కొడారి వెంకటేష్

### సామాజిక కార్యకర్త




**యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారం, అలాగే భువనగిరి మండలం బండసోమారం గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగే శ్రీ లింగభశ్వేర స్వామి బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికల్లో ఆయా గ్రామాల సర్పంచ్ లు బద్దం అంజయ్య, కాటిక జంగయ్య ల పేర్లు (ముద్రించక పోవడం) వేయకపోవడం దళిత, బహుజన జాతులకు అవమానమని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ లు అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గ్రామ సర్పంచ్ దళితుడైనందున ఆహ్వాన పత్రికల్లో పేరు వేయక అవమానించిన తీరు అలాగే బండ సోమారం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక లో గ్రామ సర్పంచ్ కాటిక జంగయ్య పేరు వేయక పోవడం చాలా విచారకరమని వారన్నారు. భారత రాజ్యాంగంలో గ్రామ సర్పంచ్ కు ఉన్న గౌరవం, గ్రామ ప్రథమ పౌరునిగా ఉన్న ప్రాధాన్యతను ఇవ్వకుండా, అగౌరవ పరిచిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అధికారులు వ్యవహరిస్తున్న పద్ధతి సరైంది కాదని వారన్నారు. కొందరు వ్యక్తుల ఒత్తిళ్లకు తలొగ్గి, గ్రామ దళిత, బహుజన సర్పంచులను అగౌరవపరిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు అధికారులే సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుందని వారన్నారు. ఇట్టి విషయమై మానవ హక్కుల కమిషన్ కు, ఎస్సీ ఎస్టీ కమిషన్ కు పిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. అలాగే సంఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.